

ఉద్యోగుల్లో ఉత్కంఠ



ప్రభుత్వం వివిధ శాఖల్లో బదిలీలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కొన్ని శాఖల్లో బదిలీ ప్రక్రియ ముగిసింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు కూడా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉద్యోగుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన ప్రతి ఒక్కరూ బదిలీ కావాల్సిందే అన్న నిబంధనతో పాటు వైకల్యం, స్పౌజ్, రిక్వెస్ట్ కింద ఎవరినైనా బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాల కలెక్టర్ల అనుమతితో త్వరలో బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉద్యోగుల బదిలీ వివరాలు నమోదు చేసుకోవడానికి హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్ నమోదుకు త్వరలోనే ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. అన్నీ సక్రమంగా జరిగితే ఈ నెలాఖరికి ఈ బదిలీ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. అప్పటి దాకా ఉద్యోగుల బదిలీ ఉత్కంఠ కొనసాగుతుంది.

నంద్యాల, జూన్12 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఒక్కసారిగా ఆ ఉద్యోగ వర్గాల్లో ఉత్కంఠ మొదలైంది. ప్రధానంగా ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన ప్రతిఒక్కరూ బదిలీ కావాల్సిందే అన్న నిబంధనతో పాటు పలురకాల వైకల్యం.. స్పౌజ్.. రిక్వెస్ట్ కింద ఎవరినైనా బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఆయా ఉద్యోగుల్లో బదిలీ గుబులు మొదలైంది. దీంతో ఆయా ఉద్యోగుల్లో కొందరు తమకు నచ్చిన స్థానాలకు తమదైన శైలిలో ప్రయత్నాలు మొదలెట్టారు. ఏదిఏమైనా పలుశాఖల తరువాత సచివాలయ ఉద్యోగులకు సైతం బదిలీ ఉత్తర్వులు రావడంతో ఆ వర్గాల్లో ఉత్కఠ రేపుతోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా...

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో పనిచేస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందర్ని కలిపి బదిలీ చేయాలని ప్రభుత్వం షరతు విధించింది. ఇదే క్రమంలో ఉమ్మడి జిల్లాల కలెక్టర్ల అనుమతితో త్వరలో సదరు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. వీటితో పాటు ఆయా గ్రామ, వార్డు సచివాల యాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పరంగా ఆయా శాఖల సమన్వయంతో సదరు కౌన్సెలింగ్ జరుగుతుంది. త్వరలోనే ప్రభుత్వం కూడా హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో ఆయా ఉద్యోగుల బదిలీలకు సంబంధించి అర్హులైన ఉద్యోగు లందరు తమ వివరాలను నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించనుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. తాజా బదిలీల పరంగా పరిశీలిస్తే.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సదరు ఉద్యోగుల్లో 60శాతం ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశం ఉందని ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది.

ఉద్యోగుల్లో ఆసక్తి..

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైనా సచివాలయ ఉద్యోగుల బదిలీకి శ్రీకారం చుట్టకపోవడంతో ఆయా ఉద్యోగులు సైతం ఉత్కంఠగా ఎదురు చూశారు. కొందరైతే విశ్వప్రయాత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. వైసీపీ పాలనలో 2023లో జరిగిన బదిలీల్లో కొందరు ఉద్యోగులు సైతం పైరవీలు చేసి పోస్టింగ్‌లు పొందారు. తద్వార కొందరికి అన్యాయం జరిగినట్లైందని బాధిత వర్గాల నుంచి తెలిసింది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం బదిలీల ఉత్తర్వులు జారీ చేయడం.. సదరు బదిలీల్లో తమకు ఎవరికి ఎక్కడికి బదిలీ అవకాశం రానుందో అని.. ఆసక్తి నెలకుంది. మొత్తానికి త్వరలోనే తమకు బదిలీలు రానుందనే విషయంలో మాత్రం సదరు ఉద్యోగులకు స్పష్టత వచ్చినట్లైంది.

ఈ బదిలీల్లో మరీ ప్రధానంగా ఆయా గ్రామ, వార్డు సచివాల యాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ కూడా తమ సొంత గ్రామం.. సొంత మండలాల పరిధిలో ఉండేందుకు అవకాశం లేదు. ఆ దిశగా నిబంధన పెట్టారు. దీంతో భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తే అవకాశం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే.. సొంత గ్రామం.. సొంత మండలానికి బదిలీకి నో ఎంట్రీ అనే విధంగా స్పష్టమైంది. గతంలో పనిచేసిన వారందరికి ఈ నిబంధన చుక్కెదురైంది.

- గ్రామ, వార్డు సచివాలయాల్లో బదిలీలకు శ్రీకారం
- వైకల్యం.. స్పౌజ్ .. రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లు
- ఒకే చోట ఐదేళ్లు దాటిన వారికి తప్పనిసరి
- ప్రజాప్రతినిధుల వద్దకు పరుగులు
- కలెక్టర్ల అనుమతితో త్వరలో కౌన్సెలింగ్
- త్వరలో హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు

నెలాఖరుకు తెర...

తాజా బదిలీ ఉత్తర్వులు ప్రకారం.. ఆయా ఉద్యోగుల బదిలీ ఉత్కంఠకు ఈ నెల ఆఖరికి తెరపడనుందని అధికార వర్గాల నుంచింది. ఒకే చోట ఐదేళ్లు దాటిన ఉద్యోగుతో పాటు వైకల్యం ఉన్న వారు, స్పౌజ్ కేటగిరి కింద ఉన్న ఉద్యోగులు, రిక్వెస్ట్ ఉద్యోగులందరూ కూడా తమ సమగ్ర వివరాలను ప్రభుత్వం త్వరలో అందించే హెచ్ఆర్ఎంస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంది. బదిలీ కౌన్సెలింగ్ మాత్రం ఉమ్మడి కలిపి ఉండనుంది. అన్ని సక్రమంగా జరిగితే ఈ నెల ఆఖరికి సదరు ఉద్యోగుల బదిలీ ప్రక్రియ ఈ నెల ఆఖరికి పూర్తయ్యే అవకాశం ఉండటంతో ఆయా ఉద్యోగుల బదిలీ ఉత్కంఠ వీడనుంది.

సిఫార్సుల కోసం..

వైసీపీ పాలనలో చాలా మంది ఉద్యోగులకు బదిలీల్లో అన్యాయం జరిగిందనే ఆరోపణలు లేకపోలేదు. ఈనేపథ్యంలో తాజా బదిలీల్లో తమకు అన్యాయం జరగకుండా జాగ్రత్త పడుతున్నారని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల్లో చాలామంది తమకు కావాల్సిన ప్రాంతాల్లో పోస్టింగ్‌ల కోసం ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధుల వద్ద సిఫార్సుల కోసం పరుగులు తీస్తున్నారు.

ఉత్తర్వులు జారీ

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీకి ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగుల బదిలీ వివరాలు నమోదు చేసుకోవడానికి హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్ నమోదుకు త్వరలోనే ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. ఐదేళ్ల దాటిన ప్రతి ఉద్యోగి బదిలీ కావాల్సిందే. రెక్వెస్ట్ బదిలీకి అవకాశం కల్పించారు.

● శివారెడ్డి, ఇన్‌చార్జి డీపీవో

తారుమారు..!

- ప్రారంభించిన మరుసటి రోజే కొట్టుకుపోయిన రహదారి
- ప్యాపిలిలో రూ.3.8 కోట్లు రోడ్డుపాలు



10వ తేదీ బుధవారం నాటికి పూర్తయిన ప్యాపిలి మండలం చిన్నపూదిళ్ల- డోన్ మండలం గుండాల రహదారి



11వ తేదీ బుధవారం రహదారిని ప్రారంభిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



12వ తేదీ గురువారం కురిసిన చిన్నపాటి వర్షానికే కొట్టుకుపోయిన రోడ్డు

నంద్యాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రహదారుల సంక్షేమానికి వందల కోట్లు ఖర్చు పెడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం చంద్రబాబు ఆశయం మంచిగానే ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం లక్ష్యం నీరుగారుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రహదారులకు మహర్దశగా మారింది. కానీ అవే రహదారులు నాయకులు, కాంట్రాక్టర్లకు వరంగా మారాయి. కనీసం పదేళ్ల పాటు ఉండాల్సిన రహదారులు నాణ్యతా లోపం కారణంగా రోజులు కూడా నిలవడం లేదు. తాజాగా డోన్ నియోజకవర్గంలో రహదారుల నాణ్యత ప్రారంభించిన మరుసటి రోజే తేటతెల్లమైంది. డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలంలోని చిన్నపూదిళ్ల గ్రామం నుంచి డోన్ మండలం గుండాల వరకు 3.5 కిలోమీటర్ల మేర తారు రోడ్డు మంజూరైంది. ఈ పనులను కడప జిల్లాకు చెందిన స్వాతి కన్‌స్ట్రక్షన్ చేపట్టింది. రూ.3.8 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ఈనెల 11వ తేదీ బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఆయన అలా ప్రారంభించిన మరుసటి రోజే గురువారం కురిసిన చిన్నపాటి వర్షానికి రహదారి కొట్టుకుపోయింది. కనీసం ఒక్కరోజు కూడా ఆ రహదారి వినియోగంలోకి రాలేకపోయింది. నాణ్యతగా రోడ్లు వేస్తున్నామంటున్న కూటమి ప్రభుత్వానికి ఇలాంటి నాసిరకం రోడ్లతో చెడ్డపేరు వచ్చేలా ఉందని డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

డీఎస్సీ పరీక్షలకు 114 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్షల్లో భాగంగా గురువారం రెండు సెషన్స్‌లో నిర్వహించిన పరీక్షలకు 114మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో మొదటి సెషన్‌లో నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ (నాన్‌లాంగ్వేజి) గణితం పరీక్షకు మొత్తం 870 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉం డగా 806 మంది అభ్యర్థులు హాజరై 64 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో నిర్వహించిన ఎస్ఏ గణితం పరీక్షకు 870మంది అభ్యర్థులకు గాను 820 మంది అభ్యర్థులు హాజరు కాగా 50మంది గైర్హాజరయ్యారు.

ఓపెన్ స్కూళ్లలో ప్రవేశాలకు నోటిఫికేషన్

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపన్ స్కూల్ పది, ఇంటర్‌లో ప్రవేశాలు పొం దేందుకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఈవో జనార్దన్ రెడ్డి తెలిపారు. డీఈవో మాట్లాడుతూ 14 సంవత్సరాలు పూర్తయిన వారికి పదో తరగతిలో, 15యేళ్లు నిండిన వారికి ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖా స్తు స్వీకరిస్తారని, ఈనెల 30వ తేదీ లోపు ఆన్‌లైన్ దరఖాస్తులు సబ్మిట్ చేయాలన్నారు. అడ్మిషన్ ఫీజు చెల్లించడానికి ఈనెల 31 చివరి తేదీగా నిర్ణయించారని, రూ.200 ఆలస్య ఫీజుతో జులై 15 లోపు చెల్లించ వచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

భారీ వర్షం

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో బుధవారం రాత్రి పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. ప్యాపిలిలో అత్యధికంగా 54.8 ఎంఎం వర్షపాతం నమోదైంది. గడివేములలో 49.4, బండిఆత్మకూరు 41.6, శిరువెళ్ల 39.2, మిడ్తూరు 36.4, నంద్యాల పట్టణం 34.0, రుద్రవరం 31.0, పాణ్యం 25.2, డోన్ 23.4, కోవెలకుంట్ల 20.0, మహానంది 19.2, నంద్యాలరూరల్ 18.2, బనగానపల్లె 18.2, ఉయ్యాలవాడ 14.8, శ్రీశైలం 12.4, గోస్పాడు 12.2, నందికొట్కూరు 9.4, ఆత్మకూరు 8.2, కొత్తపల్లె 7.2, పాములపాడు 5.8, జూపాడుబంగ్లా 5.6, సంజామల 5.2, వెలుగోడు 4.4, ఆళ్లగడ్డ 4.4, పగిడ్యాల 3.8, దొర్నిపాడు 3.8, కొలిమిగుండ్ల 3.4, అవుకు 1.4, బేతంచర్ల 1.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 513.8 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

నేడు బెలుం గుహల్లో యోగాంధ్ర

నంద్యాల నూనెపల్లె, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బెలుం గుహల వద్ద నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంపై గురువారం కలెక్టరేట్‌లో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర వేడుకల్లో భాగంగా బెలుం గుహల్లో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి భారీగా తరలివచ్చేలా అధికారులు ప్రజలకు తెలియజేయాలన్నారు. సంబంధిత ప్రదేశాల్లో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా ఈ నెల 14న ఉదయం 7నుంచి 8గంటల వరకు డెమో నిర్వహించేందుకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ నెల 14, 21తేదీల్లో జరిగే కార్యక్రమాల గురించి స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి ఆహ్వానించాలన్నారు. అదేవిధంగా ఈనెల 16న నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 10 వేల మందితో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఆశావహుల నిరీక్షణ



నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులు నిరీక్షిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తుండటంతో వారిలో ఉత్కంఠ నెలకొంది. కర్నూలు జిల్లాలో మొత్తం ఏడు వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో వ్యవసాయ ఉత్పత్తులు క్రయవిక్రయాలు రెగ్యులర్‌గా సాగుతున్నాయి. మంత్రాలయం (కోసిగి), కోడుమూరు, ఆలూరు మార్కెట్ యార్డులు అలంకార ప్రాయంగా ఉన్నాయి. పత్తికొండలో మాత్రం సీజన్‌లో టమోటా విక్రయాలు, మిగిలిన సమయాల్లో పశువుల సంత జరుగుతుంది. కాగా సోమవారం ఎమ్మిగనూరు, పత్తికొండ మార్కెట్ పాలకవర్గాలు కొలువుదీరాయి. కాగా మిగతా స్థానాల్లో చైర్మన్‌గిరి ఎవరికి దక్కుతుందన్న దానిపై ఉత్కంఠత కొనసాగుతోంది. కాగా కర్నూలు, ఆదోని చైర్మన్ పీఠాలపై తీవ్ర పోటీ నెలకొంది. ఎవరికీ వారు తమతమ అనుచరులకు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏదిఏమైనా జిల్లాలో మార్కెట్ చైర్మన్ పదవులపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

కర్నూలు చైర్మన్ పీఠంపై తీవ్ర పోటీ

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు ఉల్లి క్రయ విక్రయాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంటుంది. రాష్ట్రంలో ప్రధాన మార్కెట్లలో ఇది ఒకటి. ఏడాదిలో సుమారు రూ.700 కోట్లకు పైగా విలువైన వివిధ పంట ఉత్పత్తులు విక్రయాలు జరుగుతున్నాయి. కూరగా యాల హోల్‌సెల్ మార్కెట్ కూడా ఇక్కడే నిర్వహిస్తున్నారు.

కర్నూలు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం కృషి చేసిన తెలుగు తమ్ముళ్లు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పదవుల కోసం ఆశావహులు నిరీక్షిస్తున్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది అవుతోంది. కీలకమైన వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ సహా పాలకవర్గ సభ్యుల నియమాకాలు చేయకపోవడం తెలుగు తమ్ముళ్లను నిరాశకు గురి చేస్తుంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏడు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఎమ్మిగనూరు మార్కెట్ చైర్మన్‌గా గోనేగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామానికి చెందిన కురువ మల్లయ్య, పత్తికొండ మార్కెట్ యార్డు చైర్మన్‌గా కృష్ణగిరి మండలం అలంకొండకు చెందిన నబీసాహెబ్ సోమవారం బాధ్యతలు చెపట్టారు. రాష్ట్రంలో పత్తి, ఉల్లి విక్రయాల్లో కీలకమైన ఆదోని, కర్నూలు మార్కెట్‌యార్డులు సహా మంత్రాలయం, కోడుమూరు, ఆలూరు మార్కెట్ పాలనాధీశులు ఎవరు? నామినేటెడ్ పదవుల ఎంపికలో జాప్యానికి కారణాలు ఏమిటి? టీడీపీ శ్రేణుల్లో జరుగుతున్న హాట్ టాపిక్ ఇది. ఏఎంసీ నామినేటెడ్ పదవుల పందేరం రాజకీయ వేడి రాజుకుంది.

మిగతా 6వ పేజీలో

- కొలిక్కిరాని మార్కెట్ చైర్మన్ల ఎంపిక..!
- జిల్లాలో ఏడు వ్యవసాయ మార్కెట్ యార్డులు
- ఐదు కమిటీల చైర్మన్ల ఎంపికలో జాప్యం
- కొలువుదీరిన ఎమ్మిగనూరు, పత్తికొండ పాలకవర్గం

ఏడు మార్కెట్లలో ఏడాదికి..

జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో వ్యవసాయ ఉత్పత్తులు క్రయవిక్రయాలు రెగ్యులర్‌గా సాగుతున్నాయి. పత్తికొండ మార్కెట్ సీజన్‌లో టమోటా విక్రయాలు, మిగిలిన సమయాల్లో పశువుల సంత జరుగుతుంది. మంత్రాలయం (కోసిగి), కోడుమూరు, ఆలూరు మార్కెట్ యార్డులు అలంకారప్రాయంగా ఉన్నాయి. కోడుమూరు పేరుకే మార్కెట్ ఇక్కడ కనీసం ఆఫీసు కూడా లేదు. ఏడు మార్కెట్లలో ఏడాదికి రూ.3,600 కోట్లకు పైగా విలువైన వ్యవసాయ ఉత్పత్తులు క్రయవిక్రయాలు జరుగతున్నాయి.



ఆదోని మార్కెట్ యార్డు

మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా హరిబాబు

ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఫరూక్



హరిబాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల 17వ మార్కెట్ యార్డు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం టెక్కె మార్కెట్ యార్డులో గురువారం ఘనంగా జరిగింది. మార్కెట్‌యార్డు డిప్యూటీ డైరెక్టర్ కల్పన ఆధ్వర్యంలో నిర్వహించిన మార్కెట్ యార్డు పాలకమండలి ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, దూదేకుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, కాపుసంఘం నాయకులు రామచంద్రారావు, డాక్టర్ రవికృష్ణ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, టీడీపీ రాష్ట్ర యువత నాయకులు ఎన్ఎండీ ఫయాజ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్. ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్‌యార్డు చైర్మన్‌గా ఎంపికైన గుంటుపల్లి హరిబాబు, వైస్ చైర్మన్‌గా దియ్యాల రంగప్రసాద్‌రావుల చేత డిప్యూటీ డైరెక్టర్ కల్పన ప్రమాణస్వీకారం చేయించారు. సభ్యులుగా భవనాశి ప్రమీలమ్మ, దుమావత్ స్వామి నాయక్, నంద్యాల విజయగౌరి, గొటికె నాగలక్ష్మి, జిల్లెల్ల అనసూయమ్మ, జమ్మునబోయిన లీలావతి, యర్ర లింగన్నగారి నాగమ్మ, పిట్టల మదార్‌సా, పిచ్చిక సుమలత, పబ్బతి రవికుమార్, షేక్‌నూర్‌బాష, షేక్‌అజ్మీర్‌ల చేత మార్కెట్ యార్డు సహాయ కార్యదర్శి శేషిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ హరిబాబు రైతు కుటుంబానికి చెందిన వ్యక్తిగా రైతులకు అన్నివిధాలుగా అండగా ఉంటాడని భరోసానిచ్చారు. ఏవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్, కానాలబాబు, కృపాకర్, శివశంకర్‌యాదవ్, కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

- ఆడపిల్లలు జాగ్రత్తగా ఉండాలి
- మూడో అదనపు జిల్లా న్యాయాధికారి

నంద్యాల హాస్పిటల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ క్రమశిక్షణను నేర్పుతుందని మూడో అదనపు జిల్లా న్యాయాధికారి అమ్మన్న రాజా అన్నారు. గురువారం ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 18సంవత్సరాల్లోపు ఉన్నవారు ఎలాంటి పనులు చేయకూడదని, తల్లిదండ్రుల మాటవిని చదువుకోవాలన్నారు. బంధువులు కూడా రాబందుల్లా తయారవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆడపిల్లలు జాగ్రత్తగా ఉండాలన్నారు. చట్టం అందరికీ సమానమని కుల, మతభేదం లేకుండా అందరూ సమానహక్కులను అనుభవించాలన్నారు. చట్టాన్ని, జాతీయ జెండాను, మన ఆచార సంప్రదాయాలను గౌరవించాలని పేర్కొన్నారు. దేశాన్ని రక్షించేవారు, అన్నం పెట్టేవారు జైజవాన్-జైకిసాన్ ఇద్దరూ చాలా ముఖ్యమన్నారు. తాను ఎన్‌సీసీలో పాల్గొన్నానని, ప్రస్తుతం ఉన్నతమైన స్థితికి చేరుకోవడానికి ఎన్‌సీసీ నేర్పించిన క్రమశిక్షణే కారణమన్నారు. కార్యక్రమంలో కమాండెంట్ కల్నల్ జోబిఫిలిప్, చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి, లెఫ్టినెంట్ కల్నల్ శ్రీప్రియ, ఎన్‌సీసీ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి అమ్మన్నరాజా





యోగా చేస్తున్న యువకులు

కొండారెడ్డి బురుజుపై 'యోగా'

కర్నూలు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యోగా... మానవ జీవితంలో ఒక భాగమైతే ఆరోగ్యం మన సొంతమైనట్టే. రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం కర్నూలు జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. గురువారం కర్నూలు జిల్లా ఐకానిక్‌గా గుర్తింపు పొందిన చారిత్రాత్మక కట్టడం కొండారెడ్డి బురుజు వద్ద ప్రజలు, విద్యార్థులు వేసిన యోగాసనాలు ఆలోచింపజేశాయి. కొండారెడ్డి బురుజుపై, బురుజు ఎదుట రహదారుల్లో గురువారం ఉదయం వందలాదిగా పట్టణ ప్రజలు తరలివచ్చి యోగాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ జీవితంలో అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, ఎన్సీసీ కమాండెంట్ ప్రసాద్, జడ్పీ సీఈఓ నాసర రెడ్డి, డీఎస్‌ఓ రాజా రఘువీర్, డీఎస్పీ రాఘవేంద్ర, మెప్మా పీడీ నాగ శివలీల, టూరిజం శాఖ అధికారి విజయ్, కార్పొరేటర్ కైప పద్మలతా రెడ్డి, ఆయూష్ డాక్టర్ ప్రసాద్, యోగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అవినాష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.






యోగా నిర్వాహకులకు బహుమతులు



కొండారెడ్డి బురుజు ఎదుట రహదారిపై యోగాసనాలు

నేడు జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు శుక్రవారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఏడుస్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10.00 గంటల నుంచి 11.00 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11.00 నుంచి 12.00 గంటల వరకు మూడోవ, 12.00 గంటల నుంచి 1.00 గంటల వరకు 6వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 1.00 నుంచి 2.00 గంటల వరకు 4వస్థాయి సంఘం, 2.30 గంటల నుంచి 3.30 వరకు 5వ స్థాయి సంఘం, 3.30 నుంచి 5.30 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈవో వివరించారు.

జిల్లా పరిశ్రమల కేంద్రంలో బదిలీలు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల కేంద్రంలో బదిలీలు జరిగాయి. సాధారణ బదిలీల్లో భాగంగా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించి, సెలవులో వెళ్లిన కేపీ సుధాకర్‌ను ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఉప సంచాలకులు ఉంటూ ఇన్‌చార్జి జీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న అరుణ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నంద్యాల జిల్లా పరిశ్రమల కేంద్రంలో ఉప సంచాలకులుగా పనిచేస్తున్న జవహర్ బాబును కర్నూలుకు బదిలీ చేశారు.

చౌడేశ్వరీమాత ఆలయ ఏసీగా శ్రీనివాసరెడ్డి



బనగానపల్లె, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా నల్లకాల్వ శ్రీనివాసరెడ్డిని నియమించారు. నందవరం ఆలయ ఈవోగా పనిచేస్తున్న కామేశ్వరమ్మను అమరావతికి సమీపంలోని దేవాలయాలకు బదిలీచేశారు. ఆమెస్థానంలో మహానంది దేవస్థాన ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డిని నందవరం చౌడేశ్వరీమాత ఆలయానికి బదిలీ అయ్యారు. ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. శుక్రవారం ఆయన నందవరం ఆలయంలో పదవీబాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు వైద్యశాఖలో బదిలీల జాబితా విడుదల

కర్నూలు హాస్పిటల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖలో జిల్లా క్యాడర్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల ఆప్షన్ జాబితాను శుక్రవారం అధికారులు ప్రకటించనున్నారు. జాబితా విడుదల అనంతరం ఈ నెల 14, 15 తేదీల్లో అభ్యంతరాలు ఉంటే జిల్లా వైద్య శాఖ కార్యాలయానికి తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. రిడిప్లాయిమెంటులో ఉన్న ఏఎన్‌ఎంలు కోరుతుంటే తప్ప బదిలీలు ఉండవని ఇంత వరకు 30 మంది తమకు బదిలీలు వద్దంటూ వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, తెలిపారు. గురువారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో బదిలీల జాబితా కోసం స్క్రూటినీని కార్యాలయ ఏవో అరుణ ఆధ్వర్యంలో సీనియర్ అసిస్టెంట్లు భూపాల్, లోకసాయి, జూనియర్ అసిస్టెంట్లు సోహేల్, మన్సూర్ నిర్వహించారు.

వైద్యసేవల్లో కర్నూలుకు మొదటి స్థానం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా పథకం కింద మేనెలలో 3,553 రోగులకు చికిత్స ఆపరేషన్లు నిర్వహించి రాష్ట్రంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మొదటి స్థానంలో నిలిచిందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆసుపత్రి ధన్వంతరీ హాలులో వివిధ విభాగాల హెచ్‌వోడీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ-హాస్పిటల్ అమలు పూర్తిస్థాయిలో జరగాలన్నారు. రెగ్యులర్‌గా ప్రతి విభాగపు ఓపీ, ఐపీ డిశ్చార్జ్ కేసులను ఈ-హాస్పిటల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సమీక్షలో సీఎస్ఆర్ఎంవో బి.వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, హెచ్‌వోడీలు సి.శ్రీనివాసులు, విజయానందబాబు, రాధారాణి, శ్రీలక్ష్మి, మాధవీ శ్యామల, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పదునైన వాన..

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్‌లో నైరుతి రుతుపవనాలు మే నెలాఖరులోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రవేశించి కొన్ని రోజులు వరుస వర్షాలతో రైతన్నలను మురిపించాయి. అయితే ఆ తర్వాత జూన్ నెల మొదలు కాగానే వర్షం పడకేసింది. అప్పటికే ఉమ్మడి జిల్లాలో దాదాపు 15వేల హెక్టార్లలో పత్తి, ఉల్లి, మిర్చి తదితర పంటలు సాగు చేసిన రైతులు వర్షం జాడ లేక ఎండవేడిమికి మొలక రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందారు. రోజూ పొలాలకు వెళ్లి చినుకు కోసం ఆకాశం వైపు చూడడం తప్పితే.. వారి ఆశలను వరుణదేవుడు ఏ మాత్రం పట్టించుకోలేదు. అయితే.. రెండు రోజుల నుంచి మేఘాలు దట్టంగా అలుముకుని రైతులకు శుభసూచకాన్ని అందించాయి. గురువారం కర్నూలు జిల్లా అంతటా భారీ ఎత్తున వర్షం నమోదైంది. జిల్లాలోని 21 మండలాల్లో 79.4 ఎంఎం వర్షం నుంచి 12.8 ఎంఎం వర్షం నమోదైంది. జూన్ నెలలో సగటు వర్షపాతం 31.1 ఎంఎం కురవాల్సి ఉండగా.. గురువారం ఒక్కరోజే 31.1 ఎంఎం నమోదైంది. జూన్ మొదలుకొని గురువారం వరకు 59.9 ఎంఎం వర్షపాతం నమోదైంది. పొలాలు పదునెక్కడంతో గడువులోపు విత్తనం వేస్తే అధికోత్పత్తితో పాటు చీడపురుగులు వ్యాపించవనే నమ్మకంతో రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారు. కర్నూలులోని కొత్తబస్టాండు వద్ద ఉన్న అంగళ్ల వద్ద ఎరువులు, విత్తనాల కోసం రైతులు క్యూ కట్టారు.

సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం

- కడుపు నిండా తింటున్న విద్యార్థులు
- ఈ విద్యా సంవత్సరం నుంచి మెనూలో మార్పులు



బియ్యం అందజేస్తున్న డీఈవో





కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా సన్నబియ్యంతో భోజనం ఏర్పాటు చేస్తోంది. గతంలో పీడీఎఫ్ ద్వారా సరఫరా చేసిన దొడ్డు బియ్యంతో తయారు చేసిన భోజనం తినలేక విద్యార్థులు కడుపును మాడ్చుకుని ఇంటికి వెళ్లేవారు. మరికొంత మంది పాఠశాలలకు వచ్చే టప్పుడు ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకునేవారు. పాఠశాలలో తయారు చేసే భోజనం మెత్తగానూ, ముద్ద ముద్దగా ఉండటంతో తినలేక పారవేసేవారు. కూటమి ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం సరఫరా చేస్తోంది. కర్నూలు జిల్లాలో 2.70 లక్షల మంది విద్యార్థులు ఈ పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. సివిల్ సప్లయ్ శాఖ ద్వారా 25 కేజీల సంచుల్లో సన్నబియ్యం ప్యాక్ చేసి పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. బియ్యం దుర్వినియోగం కాకుండా బ్యాగులపై క్యూఆర్ కోడ్ నెంబరును కూడా ముద్రించారు. సోమవారం తెల్ల అన్నం, వెజిటబుల్ కర్రీ, గుడ్డు, చిక్కి, మంగళవారం పులగం, నిమ్మ అన్నం, చింతపండు అన్నం, వేరుశనగ చెట్నీ, గుడ్డు రాగి జావ, బుధవారం తెల్ల అన్నం, వెజిటెబుల్ సాంబారు, గుడ్డు, చిక్కి, గురువారం వెజిటబుల్ రైస్, ఎగ్ కర్రీ, రాగి జావ, శుక్రవారం తెల్ల అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కి, శనివారం తెల్ల అన్నం, కందిపప్పు చారు, బెల్లం పొంగలి, రాగి జావ మెనూగా విద్యాశాఖ అధికారులు రూపొందించారు.

విద్యార్థి కిట్ల నాణ్యత బాగుంది



ప్రభుత్వం విద్యార్థులకు సరఫరా చేసిన విద్యార్థి మిత్ర కిట్లు నాణ్యత బాగుంది. పేద విద్యార్థులకు ఎంతో ఊరట ఇస్తుంది. పేద కుటుంబాలకు ఇది ఊరట.

● రసూల్ ఖాన్, విద్యార్థి తండ్రి, ఖండేరి వీధి

గతంలో భోజనం తినేవారు కాదు



పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచికరంగా లేని కారణంగా గతంలో విద్యార్థులు సరిగా తినేవారు కాదు. అర్ధాకలితో ఇంటికి వెళ్లి తినేవారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం వండటంతో కడుపు నిండా భోజనం చేస్తున్నారు.

● నాగదేవి, ఉపాధ్యాయురాలు

స్కూల్ బ్యాగ్ బావుంది



ప్రభుత్వం సరఫరా చేసిన విద్యార్థి మిత్ర కిట్ బ్యాగ్ బావుంది. యూనిఫాం డిజైన్ కూడా కార్పొరేట్ స్థాయిలో ఉంది. మాకు ఎంతో ఆనందంగా ఉంది.

● బద్రినాథ్, పదో తరగతి విద్యార్థి

ఆంధ్రజ్యోతికి రుణ పడి ఉంటా

- 'పది' పాస్ అవుతానని అనుకోలేదు
- ఆనంద బాష్పాలతో సన్నక్కి
- పదో తరగతిలో ఉత్తీర్ణత



పరీక్ష హాలులో కాదు..

'వలస' వెళ్లి పొలంలో!

» చిన్నారికి వచ్చిన పెద్ద కష్టం

» పది పరీక్షలు రాయాల్సిన చేతులతో మిర్చి కోతలు

ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనం

కోసిగి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కథనాలే తన జీవితాన్ని మలుపు తిప్పాయని, ఆంధ్రజ్యోతికి రుణపడి ఉంటానని విద్యార్థిని సన్నక్కి పేర్కొంది. గురువారం విడుదలైన పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించింది. పదో తరగతి పరీక్షలు రాయాల్సిన విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు వలస వెళ్లి గుంటూరులో మిర్చి పొలాల్లో కూలీగా పనిచేస్తుంది. విషయం తెలుసుకున్న 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి చిన్నారితో మాట్లాడారు. ఈమేరకు 'పరీక్ష హాలులో కాదు.. 'వలస' వెళ్లి పొలంలో' అనే కథనం ప్రధాన సంచికలో ప్రచురితమైంది. ఈ కథనానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. కర్నూలు, గుంటూరు జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి గుంటూరు జిల్లా పేరెచర్ల పంట పొలాల్లో మిర్చి తీసేందుకు కూలీగా పని చేస్తున్న సన్నక్కి చిన్నారిని సొంతూరు అయిన కోసిగి మండలం చింతకుంట గ్రామానికి తీసుకువచ్చారు. అప్పటికే పదో తరగతి రెండు పరీక్షలు పూర్తికావడంతో మూడో పరీక్ష నుంచి మొత్తం నాలుగు పరీక్షలు రాయించారు. ఆ నాలుగు పరీక్షల్లో ఆమె ఉత్తీర్ణత సాధించింది. మిస్ అయిన మిగతా రెండు పరీక్షలను సప్లిమెంటరీలో రాసింది. గురువారం సాయంత్రం విడుదలైన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో 344 మార్కులతో విద్యార్థిని సన్నక్కి చిన్నారి ఉతీర్ణత సాధించింది. ఆంధ్రజ్యోతి కథనం తన జీవితానికి వెలుగుఇచ్చి తన స్నేహితులతో కలిసి పై చదువులు చదివేందుకు తోడ్పాటు ఇచ్చిందని విద్యార్థిని సన్నక్కి చిన్నారి ఆనందబాష్పాలతో కన్నీటి పర్యంతమైంది.విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, కర్నూలు, గుంటూరు జిల్లా కలెక్టర్లకు, జిల్లా విద్యాశాఖ అధికారి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.



విద్యార్థిని సన్నక్కి చిన్నారి (ఫైల్)

ఆశావహుల నిరీక్షణ

(5వ పేజీ తరువాయి)

ఒక శాతం సెస్సు రూపంలో రూ.7 కోట్లు ఆదాయం వస్తుంది. ఎంతో కీలకమైన ఆ మార్కెట్ చైర్మన్ పీఠం కోసం టీడీపీలో తీవ్ర పోటీ ఉంది. ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు అత్యంత సన్నిహితుడైన కల్లూరు మండలం పెద్దపాడు గ్రామం టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్.చంద్రకళాధర్‌రెడ్డి చైర్మన్ పీఠం ఆశించారు. అయితే.. కర్నూలు అసెంబ్లీ నియోజవర్గం పరిధిలో మార్కెట్ యార్డు వస్తుండడం, బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి టీజీ భరత్ సిఫారసు చేసిన వారికే చైర్మన్ పీఠం దక్కే అవకాశం ఉంది. టీజీ భరత్‌కు అత్యంత సన్నిహితుడైన టీడీపీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు గోల్కొండ అబ్దుల్ అమీద్ సతీమణి గోల్కొండ అజ్మత్‌బీ పేరును సిఫారస్ చేసినట్లు తెలుస్తుంది. మైనార్టీ కోటాలో చైర్మన్ గిరి అజ్మత్‌బీకే దక్కే ఛాన్స్ ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

ఆదోని పీఠంపై ఉత్కంఠ

ఆదోని వ్యవసాయ మార్కెట్ ఆదాయంలో రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉంది. గుంటూరు మార్కెట్ తరువాత స్థానం ఆదోనిదే. పత్తి విక్రయాల్లో అగ్రస్థానంలో ఉంది. ఏడాదిలో రూ.1,700 కోట్లకు పైగా విలువైన పత్తి సహా వేరుశనగ, ఆముధం, మిరప, వాము.. ఇలా వివిధ పంట ఉత్పత్తులు క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఒక శాతం మార్కెట్ సెస్సు రూపంలో రూ.17 కోట్లు ఆదాయం వస్తుంది. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవికి ఏమాత్రం తీసిపోని ఆదోని మార్కెట్ యార్డు చైర్మన్ పీఠం కోసం కూటమి పార్టీల్లో తీవ్ర పోటీ నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పార్టీల మద్దతుతో బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి ఎమ్మెల్యేగా గెలిచారు. మార్కెట్ చైర్మన్ పీఠం మాకే కావాలని బీజేపీ నేతలు పట్టుబడుతున్నారు. తమకే ఇవ్వాలని కూటమి ప్రధాన పార్టీ టీడీపీ సహా జనసేన నాయకులు డిమాండ్ చేస్తున్నారు. టీడీపీ అధిష్ఠానం కూడా స్పష్టత ఇవ్వలేదు. కూటమి నేతల మధ్య కుమ్ములాటలు, సయోధ్య కుదరకపోవడంతో మూడు పార్టీలు కూడా ప్రతిపాదనలు పంపలేదని తెలుస్తుంది. ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ తరువాత ఆ స్థాయి రాజకీయ హోదా కలిగిన మార్కెట్ యార్డు చైర్మన్ పీఠం దక్కేది ఎవరికి..? అంటూ కూటమి పార్టీల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఆ మూడు మార్కెట్ల చైర్మన్లు ఎవరు?

కోడుమూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రధాన కేంద్రం గూడూరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కోడుమూరు టీడీపీ టికెట్‌ను ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో పాటు బి.తాండ్రపాడు సర్పంచ్ ఆకెపోగు జయన్న కూడా ఆశించారు. ఇద్దరు కూడా కేడీసీసీబీ చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డికి అత్యంత సన్నిహితులే. అధిష్ఠానం బొగ్గుల దస్తగిరికి టికెట్ ఇవ్వడం.. ఆయన ఎమ్మెల్యేగా గెలవడం తెలిసిందే. జయన్నకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడంతో కోడుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠం ఆయన సతీమణి ఆకేపోగు సుగణమ్మకు ఇవ్వనున్నట్లు తెలిసింది. ఆమె పేరును ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు సమాచారం. మంత్రాలయం మార్కెట్ చైర్మన్ పీఠం కోసం కోసిగికి చెందిన టీడీపీ పట్టణాధ్యక్షుడు నర్సిరెడ్డి, తెలుగురైతు సంఘం నాయకులు కోసిగయ్య పేర్లను ప్రతిపాదించినట్లు తెలిసింది. ఆలూరు మార్కెట్ చైర్మన్ పదవి కోసం గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు స్వయాన సోదరుడు బూర్ల త్యాగరాజు పేరును టీడీపీ ఇన్‌చార్జి బి.వీరభద్రగౌడ్ ప్రతిపాదించినట్లు తెలుస్తుంది. టీడీపీ సీనియర్ నాయకులు చిన్నహ్యాట్ శేషగిరి, ఆస్పరి మాజీ ఎంపీపీ బిల్లేకల్లు వెంకటేశ్ పేర్లను టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం ప్రసాద్ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. వివిధ కారణాల వల్ల కర్నూలు, ఆదోని, కోడుమూరు, మంత్రాలయం, ఆలూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపికలో జరుగుతున్న జాప్యం వల్ల ఆశావహులు, టీడీపీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.



ఆలూరు మార్కెట్ యార్డు

వైద్యారోగ్య శాఖ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. వైదారోగ్య శాఖలో ఆడిట్ పేరుతో కొందరు వసూళ్ల దందాకు తెర లేపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 87 పీహెచ్‌సీలు, 20 సీహెచ్‌సీలు, రెండు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్స్, రెండు ఏరియా ఆసుపత్రులున్నాయి. వీటిని బలోపేతం చేయడానికి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద ఏటా రూ.15కోట్ల వరకు నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తాయి. ఆసుపత్రుల్లో మందుల సరఫరా, అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు రోగులు, గర్భిణులకు రవాణా, పరికరాల కొనుగోలు కోసం వీటిని ఖర్చు చేస్తారు. ప్రభుత్వం ఆసుపత్రులకు కేటాయించే నిధులకు సంబంధించిన ఐదేళ్ల ఆడిట్ (ఏజీ) చేయడం సర్వసాధారణం. ఆడిట్ అధికారుల పేరు చెప్పి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కర్నూలు డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొందరు పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కర్నూలు జిల్లాలోని ఒక్కొక్క పీహెచ్‌సీకి రూ.5వేల నుంచి రూ.8వేల వసూళ్లు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో ఒక్కొక్క పీహెచ్‌సీకి రూ.10వేలు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. పీహెచ్‌సీ ఎంత మొత్తం ఇవ్వాల్సింది కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసులోని ఓ ఉద్యోగి ఫిక్స్ చేస్తారు.



లెక్కార్పయామి..!

- ఆడిట్ పేరుతో వసూళ్లు?
- రూ.5వేల నుంచి రూ.8వేలు ముట్టజెప్పాల్సిందే
- ముడుపులు ఇవ్వలేమని చేతులెత్తేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు
- హడలెత్తిపోతున్న సిబ్బంది
- వైద్యారోగ్య శాఖపై వసూళ్ల ఆరోపణలు

కర్నూలు హాస్పిటల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లెక్కలు తేలాలంటే ఇంతో.. అంతో సమర్పించాల్సిందే. వైద్యారోగ్య శాఖలో ఆడిట్ (ఏజీ) పేరుతో కొందరు వసూళ్ల దందాకు తెర లేపారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులు, ఇతర ఆసుపత్రులు నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించాల్సిందేనని హుకుం జారీచేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బంది హడలెత్తిపోతున్నారు. కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసుకు క్యూకట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్ఎస్), ప్రాంతీయ (ఏరియా) ఆసుపత్రులను పూర్తిస్థాయిలో బలోపేతం చేయడానికి కేంద్రం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం)ను అమలు చేస్తోంది. ఇందుకుగానూ ఉమ్మడి జిల్లాలో ఏటా రూ.15 కోట్లు వరకు నిధులు వెచ్చిస్తోంది. ఆసుపత్రుల్లో మందుల సరఫరా, అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు రోగులు, గర్భిణులకు రవాణా, పరికరాల కొనుగోలు కోసం వీటిని ఖర్చుచేస్తారు. వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వం ఆసుపత్రులకే కేటాయించే నిధులకు సంబంధించిన ఐదేళ్ల ఆడిట్ (ఏజీ) చేయడం సర్వసాధారణం. 2019 నుంచి 2024 వరకు విజయవాడ నుంచి ముగ్గురు సభ్యులు గల ఆడిట్ అధికారులు ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఆడిట్ అధికారుల పేరు చెప్పి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కర్నూలు డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొందరు పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారు.

2019లో చివరిసారిగా ఆడిట్..

ప్రతి ఐదేళ్లకోసారి ఎన్‌హెచ్ఎం నిధులు, ఉద్యోగుల జీతభత్యాలపై ఆడిట్‌ను అధికా రులు నిర్వహిస్తారు. 2019లో చివరి సారిగా ఆడిట్ జరిగింది. మళ్లీ ఇప్పుడు 2019 నుంచి 2024 వరకు ఆడిట్ చేయాల్సి ఉంది. ఎన్‌హెచ్ఎం నిధులు సక్రమంగా పంపిణీ చేశారా? నిధులు ఖర్చు చేయడంలో నిబంధనలు పాటించారా? లేదా? నిర్లక్ష్యంగా వహించారా? అవినీతి అక్రమాలకు పాల్పడ్డారా? అన్న అంశాలు ఈ ఆడిట్‌లో బయట పడే అవకాశాలు ఉన్నాయి. ఏదైనా లోపాలు బయటపడితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉండటంతో ఆడిట్ అంటే వైద్య శాఖఅధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతు న్నాయి. నిధుల వ్యవహారంలో కచ్చితంగా ఉండే నిబంధనలను పాటించి ఉంటే భయప డాల్సి ఉండదు. అలా జరగనప్పుడు వాటిని కప్పిపుచ్చేందుకు అంతో ఇంతో ముట్టచె ప్పా ల్సిందే. ఆడిట్ అధికారులను ప్రసన్నం చేసుకోవడానికి కార్యాలయంలో కొందరు ఏజీ ఆడిట్ పేరుతో భారీగా వసూళ్లకు తెర లేపారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఒక్కో పీహెచ్‌సీ నుంచి రూ.5వేల నుంచి రూ.8వేలు చొప్పున ఆడిట్ పేరుతో ముట్టచెప్పాల్సిందే. మొదట రూ.5వేలు ఉన్న మొత్తాన్ని ఇటీవల వసూళ్ల రాయుళ్లు రూ.8వేలకు పెంచినట్లు సమాచారం.

ఎంఎల్‌హెచ్‌పీ నుంచి రూ.500

ఉమ్మడి జిల్లాలో ఎంఎల్‌హెచ్‌పీలు (మిడ్ లెవల్‌హెల్త్ ప్రొవైడర్) 800మంది ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను నిర్వహిస్తున్నారు. కర్నూలు జిల్లాలోని 440 మంది ఎంఎల్‌హెచ్‌పీల నుంచి వసూళ్ల రాయుళ్లు ముక్కుపిండి ఒక్కొక్క ఎంఎల్‌హెచ్‌పీ నుంచి రూ.500 చొప్పున వసూళ్లు చేస్తున్నారు. తాము ఒక నెల రోజుల నుంచి సమ్మెలో ఉన్నామని, మే నెల జీతం కూడా రాలేదని, 6 నెలల ఇన్సెంటివ్స్ పెండింగ్‌లో ఉన్నాయని, అద్దె కూడా రాలేదని తాము రూ.500 ఇచ్చుకోలేని ఎంఎల్‌హెచ్‌పీలు చెప్పినా ఇవేమీ వసూళ్ల రాయుళ్లకు పట్టడం లేదు. మీరు చెప్పింది ఇవ్వకపోతే జీతాలు నిలుపుదల చేయిస్తామని బెది రింపులకు దిగుతున్నారు. పత్తికొండ డివిజన్‌లోని ఓ పీహెచ్‌సీకి చెందిన ఎంఎల్‌హెచ్‌పీలు తాము రూ.500లు ఇవ్వలేమని కరాఖండిగా చెప్పినా బెదిరింపులకు దిగినట్లు సమాచారం. ఎంఎల్‌హెచ్‌పీల నుంచి వసూళ్లుచేసిన మొత్తాన్ని పీహెచ్‌సీ నుంచి మరికొందరు డీఎం హెచ్‌వో కార్యాలయానికి వసూళ్లు చేసిన మొత్తాన్ని చేరవేసినట్లు తెలిసింది. నంద్యాల జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.



- కర్నూలు డివిజన్‌లోని ఓ పీహెచ్‌సీకి సంబంధించిన ఆడిట్ జరుగుతోంది. ఆ పీహెచ్‌సీ రూ.5వేలు ఇవ్వాల్సిందిగా హుకుం జారీ చేశారు. ఈ విషయాన్ని సంబంధిత మెడికల్ ఆఫీసర్‌కు చెప్పగా నాకు సంబంధంలేదని తాము బడ్జెట్ అంతగా ఉపయోగించలేదని సమాధానం చెప్పారు. దీంతో పీహెచ్‌సీ ఉద్యోగి మరో ఉద్యోగి దగ్గర చేతి బదులు ఇప్పించుకుని రూ.5వేలు ముట్ట చెప్పారు.
- ఆదోని డివిజన్‌లోని ఓ పీహెచ్‌సీకి చెందిన ఓ ఉద్యోగి ఆడిట్ ఉంటే అంతో ఇంతో ఇవ్వాల్సి ఉంటుంది. వచ్చినవారికి సౌకర్యాలు కోసం కొంత సొమ్ము ముట్టచెప్పాల్సి ఉంటుందని చెప్పడం విశేషం.
- కర్నూలు జిల్లాలో ఎంఎల్‌హెచ్‌పీలు కూడా తమకు సంబంధం లేని ఆడిట్ కోసం ఎందుకు రూ.500లు ఇవ్వాలని పేరు చెప్పనీ ఎంఎల్‌హెచ్‌పీ పేర్కొనడం విశేషం. రూ.500లు ఇవ్వమని చెప్పిన వారిపై జీతాలు నిలుపుదల చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్న చెప్పారు.

ఓన్లీ క్యాష్..

వసూళ్ల రాయుళ్లు కొత్త పంథాను అవలంభిస్తున్నారు. వసూళ్ల పర్వం బయట పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతిదానికి ఫోన్‌పే, గూగుల్ పే వాడుతున్న ప్రస్తుత తరుణంలో ఓన్లీ క్యాష్ మాత్రమే ఇవ్వాలన్న కండిషన్ పెట్టారు. ఆన్‌లైన్ ద్వారా ఆధారాలు లభిస్తాయని, తర్వాత తమపై ఫిర్యాదు చేసి ఇబ్బంది పెట్టే ప్రమాదం ఉందని ముందు జాగ్రత్తగా ఓన్లీ క్యాష్ అన్న కండిషన్ పెట్టినట్లు సమాచారం. ఇప్పటి వరకు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులు, కర్నూలు జీజీహెచ్, నంద్యాల జీజీహెచ్, ఎంఎల్‌హెచ్‌పీల నుంచి సుమారు రూ.10లక్షలు వసూళ్లు చేసినట్లు అంచనా.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 87 పీహెచ్‌సీలు, 20 సీహెచ్‌సీలు, రెండు గవర్నమెంటు జనరల్ హాస్పిటల్స్, రెండు ఏరియా ఆసుపత్రులున్నాయి. వీటిని బలోపేతం చేయడానికి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద ఏటా రూ.15 కోట్లు వరకు నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రా లకు (పీహెచ్‌సీ) ఒక్కొక్క దానికి ఏటా రూ.1.75లక్షలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ)కు ఒక్కొక్క సీహెచ్‌సీకి రూ.5లక్షలు, ఏరియా ఆసుపత్రికి రూ.5లక్షలు నిధులు విడుదల చేస్తుంది.

డీఎంహెచ్‌వో ఆఫీసులోని ఓ ఉద్యోగి..

ఆడిట్ కోసం కర్నూలు జిల్లాలోని ఒక్కొక్క పీహెచ్‌సీకి రూ.5వేల నుంచి రూ.8వేల వసూళ్లు చేస్తున్నారు. బడ్జెట్ తక్కువ మొత్తంలో ఖర్చు పెట్టి ఉంటే రూ.5వేలు, ఎక్కువ మొత్తంలో అయితే రూ.8వేలు ఇవ్వాల్సిందే. నంద్యాల జిల్లాలో ఒక్కొక్క పీహెచ్‌సీకి రూ.10వేలు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. పీహెచ్‌సీ ఎంత మొత్తం ఇవ్వాల్సింది కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసులోని ఓ ఉద్యోగి ఫిక్స్ చేస్తారు. దానిప్రకారం ఆయా పీహెచ్‌సీ సిబ్బంది వచ్చి ఆమొత్తాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

ఆడిట్ పేరుతో వసూళ్లకు పాల్పడలేదు..



వైద్యఆరోగ్యశాఖలో 2019 నుంచి 2025వరకు ఆడిట్ (ఏజీ) షెడ్యూల్ ప్రకారం జరు గుతుంది. అన్నిరికార్డులు, బిల్లులు, ఉద్యోగుల జీతభత్యాలు, ఎన్‌హెచ్ఎం వివరాలు, ఆడిట్ అధికారులు క్షేత్రస్థాయిలో ఏ విధంగా ఉన్నాయో పరిశీలిస్తారు. ఆడిట్ అనంతరం నివేది కను సమర్పిస్తారు. ఆడిట్ పేరుతో ఎవరు వసూళ్లకు పాల్పడలేదని, ఈవిషయం తన దృష్టికి రాలేదు. అలాంటి వసూళ్లు ఎవరూ చేయలేదని అది వట్టి ప్రచారమే.

- డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్‌వో, కర్నూలు

ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తికి సీఈగా పదోన్నతి

- కడప ప్రాజెక్టు సీఈగా నియామకం
- రెగ్యులర్ ఎస్ఈగా డిప్యూటీ ఎస్ఈ బాలచంద్రారెడ్డి



కర్నూలు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖలో పలువురు ఇంజనీర్లకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తికి చీఫ్ ఇంజనీరు (సీఈ)గా పదోన్నతి ఇస్తూ కడప జిల్లా ప్రాజెక్ట్ సీఈగా బదిలీ చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా 2017లో బాధ్యతలు తీసుకున్నారు. 2021లో ధవళేశ్వరం ప్రాజెక్టు క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈగా బదిలీచేసింది. 2022లో శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈగా బదిలీ చేశారు. అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో మూడేళ్లకు పైగా ఎస్ఈగా పనిచేసిన ఏకైక వ్యక్తిగా రికార్డు నమోదు చేసుకున్నారు. సీఈగా పదోన్నతిపై కడపకు బదిలీ చేయడంతో రెండు మూడు రోజుల్లో రిలీవయ్యే అవకాశం ఉంది. కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ డిప్యూటీ ఎస్ఈ బాలచంద్రారెడ్డి ప్రస్తుతం ఎస్ఈ (ఎఫ్ఏసీ)గా ఉన్నారు. ఈయనకు ఎస్ఈగా పదోన్నతి ఇచ్చి ఇక్కడే రెగ్యులర్ ఎస్ఈగా నియమించారు. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు క్వాలిటీ సెల్ సబ్ డివిజన్-3 డీఈఈ ఎన్.వేణుగోపాల్‌కు ఈఈగా పదోన్నతి ఇచ్చి నంద్యాల జిల్లా ఎస్ఆర్‌బీసీ ఎస్ఈ ఆఫీస్ డిప్యూటీ ఎస్ఈగా బదిలీ చేశారు.

కష్టపడి పనిచేస్తే విజయం ఖాయం



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

- ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుదాం
- ప్రజలను మోసం చేస్తున్న, బీజేపీ, కూటమి ప్రభుత్వం
- బీజేపీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్ పార్టీకే..
- పార్టీ బలోపేతానికి అందరూ కృషిచేయాలి
- పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

నంద్యాల రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో కష్టపడి పనిచేస్తే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ అధ్యక్షతన జిల్లాస్థాయి నాయకులు, కార్యకర్తలతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాసమ స్యలపై నిరంతరం పోరాడుదామని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అప్పుడే ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం దక్కించు కోవచ్చన్నారు. దేశంలోని బీజేపీతో రాష్ట్రంలోని కూటమి నేతలు సక్రమ పొత్తు పెట్టుకొని, వైసీపీ నేత జగన్‌తో అక్రమ పొత్తు పెట్టుకొని ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ కృషిచేయాలని, నిరంతరం ప్రజల్లోనే ఉంటూ వారానికి రెండు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గత ఎన్నికల్లో ప్రజలు ఓట్లు చీలకూడదని వైసీపీపై వ్యతిరేకతతో కూటమికి వేశారని, ఇప్పుడు ఆపరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ఓట్లు తిరిగి వెనక్కి రావాలంటే ప్రజలకు పార్టీపై నమ్మకాన్ని కలిగించేలా కృషిచేయాలన్నారు. రాష్ట్రంలోని అన్నిపార్టీలు బీజేపీ పక్షాన ఉండడంతో బీజేపీ ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిందని ఎద్దేవా చేశారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి గణేష్ యాదవ్, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నంద్యాల ఇన్‌చార్జి అలీఖాన్, రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు కామన్ ప్రభాకర్, అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

బడి గంట మోగని గూడెం



బడి తలుపులు తెరుచుకోని జానాలగూడెం పాఠశాల ఇదే

కొత్తపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కానీ కొత్తపల్లి మండలంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న జానాలగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల తలుపులు మాత్రం తెరుచుకోలేదు. ఐటీడీఏ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక ఎంఈవో పర్యవేక్షణలో నిర్వహించే ఈ పాఠశాల పునఃప్రారంభమైందా లేదా? అనే విషయం ఐటీడీఏ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదు. ఏప్రిల్ 23 వరకు శివపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న అంకమ్మ అనే ఉపాధ్యాయురాలు జానాలగూడెంలోని పాఠశాలలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించారు. అయితే..ఈమె కొట్టాల చెరువులోని గిరిజన పాఠశాలకు బదిలీ అయ్యారు. దీంతో జానాలగూడెం పాఠశాల తలుపులు గురువారం తెరుచుకోలేదు. ఈ విషయంపై కొత్తపల్లి ఎంఈవో2 ఇనయతుల్లాను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఈ విషయాన్ని ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా రెండు రోజుల్లో ఉపాధ్యాయులను నియమిస్తామని చెప్పారని తెలియజేశారు.

పనులు చేస్తూ అనంత లోకాలకు..
లారీ ఢీకొని కార్మికుడి దుర్మరణం

జూపాడుబంగ్లా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హైవేపై పనులు చేస్తూ ఓకార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన మం డలంలోని తర్తూరు వద్ద చోటుచేసుకున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారా యణ తెలిపారు. వివరాలు.. నందికొట్కూరు మండలం బొల్లవ రం గ్రామానికి చెందిన పక్కీరయ్య(45) తర్తూరు అంచె వద్ద జాతీయ రహదారి పనుల్లో గురువారం ఉదయం పనులు చేస్తు న్నాడు. కంకర మిక్సింగ్ లారీ అతడిని ఢీకొట్టింది. అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఘటనాస్థలికి చేరుకున్నారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ నరేషయాదవ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబానికి రూ.50లక్షల పరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రజాసంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, లాజరస్, గౌరిశ్వరనాయుడు డిమాండ్ చేశారు.

604 సెల్‌ఫోన్లు రికవరీ



మొబైల్ ఫోన్ల రికవరీ మేళాలో బాధితులతో పోలీసు అధికారులు

కర్నూలు క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో మినీ కాన్ఫరెన్స్ హాలులో మొబైల్ రికవరీ మేళా నిర్వహించారు. గురువారం కర్నూలు సైబర్ ల్యాబ్ పోలీసులు రికవరీ చేసిన 604 మొబైల్ ఫోన్లను ఏఎస్పీ హుసేన్‌పీరా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం రెండో విడత మొబైల్ రికవరీ మేళా నిర్వహించామని, మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు రూ.1.30 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. ఎవరైనా సెల్‌ఫోన్లను పోగొట్టుకుంటే Https:// kurnoolpolice.in/mobiletheft వెబ్‌లింక్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతాల ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ చెప్పకూడదని, తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ(ఏఆర్) కృష్ణమోహన్, ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసాచారి, సీఐలు అబ్దుల్ గౌస్, నాగరాజరావు, రామయ్య నాయుడు, సైబర్ ల్యాబ్ సీఐ వేణుగోపాల్, సైబర్ ల్యాబ్ టెక్నికల్ టీం పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను
నిర్మూలించాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి పిలుపు ఇచ్చారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో ఓ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిషేధ, నియంత్రణ చట్టం 2016 ప్రకారం బాల బాలికలతో పని చేయించుకోవడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ఈ చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే వారికి ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్ మాట్లాడుతూ ఎవరికైనా బాల కార్మికులు కనిపిస్తే హెల్ప్‌లైన్. నెంబర్.15100కు కానీ, 1098కు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఒక పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

రాష్ట్రంలో సుపరిపాలన

● న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ● ఏడాది పాలనపై సంబరాలు చేసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా నంద్యాల టెక్కెమార్కెట్ యార్డులో మంత్రి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో పాటు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, మార్క్ ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డితో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున హాజరై ఏడాది పాలన వేడుకలో పాల్గొన్నారు. ముందుగా కేకును కట్ చేశారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధితో పాటు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ ఏడాది పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరగని అభివృద్ధి ఈ ఏడాది కాలంలోనే జరిగిందన్నారు. ఎన్ఎండీ ఫిరోజ్, ఎన్ఎండీ ఫయాజ్, డాక్టర్ బాబన్, ఏవీఆర్ ప్రసాద్, రామచంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: ఒక వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధిని సమానంగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తి అయిన నందికొట్కూరులో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, కౌన్సిలర్ జాకీర్, నాయకులు ముర్తుజావళి, లాయర్ జాకీర్, పలుచాని మహేశ్వరరెడ్డి, వేణుగోపాల్, ఆర్టు శ్రీను, రజినీకాంత్‌రెడ్డి, లింగమయ్య, వనజ, మీనాక్షిదేవి పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులో టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, హరినాథరెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. చంద్రశేఖర్, కృష్ణ, వెంకటేశ్వరరావు, నబీరసూల్, రాముచౌదరి, నాగర్జునరెడ్డి, మల్లీశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, లింగేశ్‌గౌడ్, అర్జున్‌గౌడ్, చంద్రశేఖరరావు, జలాల్‌బాషా, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు అన్నారు. కొత్తపల్లిలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.సర్పంచ్ లక్ష్మీదేవి, నాయకులు వెంకటస్వామిరెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, అమర్నాథ్ యాదవ్, జానకీ రాముడు, నారాయణ, రహీం ఖాన్, నాగేశ్వర గౌడు, డాక్టర్ రాము, స్వామన్న, తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ నాయకులు గిరీశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి అన్నారు. జూపాడు బంగ్లాలోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. నాయకులు పరమేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, రామ్మోహన్‌రెడ్డి, రవికాంత్, రవికుమార్ యాదవ్, పెద్దన్న, సుధాకర్, శివరామిరెడ్డి, శాలుబాషా, నరసింహుడు, ఉసేనయ్య, శేఖర్‌గౌడు, వీరారెడ్డి పాల్గొన్నారు.

పగిడ్యాల: పగిడ్యాలలో టీడీపీ నాయకులు దామోదర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ సంబరాలు చేసుకున్నారు. నాయకులు వాసురెడ్డి, విజయ్, నరసింహ, పుల్లయ్యగౌడ్, బాబు పాల్గొన్నారు.

పాణ్యం: రాష్ట్ర అభ్యున్నతి వైపు దూసుకెళ్తోందని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్‌నాయుడు అన్నారు. పాణ్యంలోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. టీడీపీ కన్వీనర్ మండల జయరామిరెడ్డి, ఎంపీటీసీ రంగరమేష్, ఖాదర్‌బాషా, సునీల్, దానం, అమరసింహారెడ్డి, శీను, రవి, మోహన్, చంద్రశేఖర్ రెడ్డి, మాధవి, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, బాలనాయుడు, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో సంబరాలు



నంద్యాలలో కేక్ కట్ చేస్తున్న మంత్రి ఫరూక్

చేసుకున్నారు. మండల కేంద్రంలో టీడీపీ మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, మాజీ కో-ఆప్షన్‌మెంబర్ ఎస్ఏ రఫిక్, సుభద్రమ్మ, వడ్డు లక్ష్మీదేవి కేక్ కట్ చేసి కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు.

మహానంది: కేసీ కెనాల్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి ఆధ్వర్యంలో మహానంది సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. ఎంపీపీ యశస్విని, టీడీపీ మండల కన్వీనర్ కంచర్ల శివశంకర్ చౌదరి, టీడీపీ నాయకులు నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి, గంగిశెట్టి మల్లికార్జున, తెలుగుగంగ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతికుమార్ యాదవ్, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, రాజ, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఎన్డీఏతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు రవీంద్రబాబు, వేణుగోపాల్, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములుఅన్నారు. కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా ఆత్మకూరు పట్టణంలోని గౌడ్ సెంటర్‌లో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకొన్నారు. ముందుగా అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే టపాసులు కాల్చి, కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. నాయకులు అబ్దుల్లాపురం బాషా, గౌస్‌లాజం, రామ్మూర్తి, మల్లె ఎలీషా, ముర్తుజా, అలిహుసేన్, మోతుల్లాగౌస్, శివశంకరశర్మ, టపాల్ అష్రఫ్ అలి, రామ్‌నర్సయ్య సుబ్బరావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేల అవినీతిని అరికట్టాలి: సీపీఐ

నంద్యాల రూరల్ జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేల అవినీతికి అడ్డుకట్ట వేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం వల్ల ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. మోసపు వాగ్దానాలు చేసి అధికారం లోకి వచ్చిన ప్రభుత్వం ఏమి చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏడాది పాలనలో 142 హామీలు నెరవేర్చామంటూ గొప్పలు చెప్పుకొంటున్నారని విమర్శించారు. రాయలసీమకు తలమానికంగా ఉన్న సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలని, రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్ట్‌లను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు, మహిళల ఆర్థికావృద్ధికి సహకారం, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, ఉద్యోగ కల్పన వంటి అంశాలపై దృష్టి పెట్టాలని కోరారు.

విశాఖ ఉక్కుప్రైవేటీకరణ ఆపాలి



గాంధీచౌక్‌లో ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నంద్యాల రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ డిమాండు చేశారు. గురువారం పట్టణంలోని గాంధీచౌక్‌లో ధర్నా చేశారు. ఆమె మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు సొంత గనులను ఏర్పాటు చేయాల న్నారు. కాంట్రాక్టు వర్కర్స్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుంకయ్య, ప్రసాద్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల డ్వామా పీడీగా నారాయణ

నంద్యాల టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల డ్వామా పీడీగా నారాయణను నియమిస్తున్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం ఆత్మకూరు డీఎల్‌డీవోగా పని చేస్తున్నారు. ఇక్కడ ప్రస్తుతం పని చేస్తున్న పీడీ వెంకట సుబ్బయ్య కడపకు ప్రమోషన్‌పై డీసీవోగా బదిలీ అయ్యారు. నంద్యాల లో త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా శేషన్న బాధ్యతలు



నంద్యాల టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా శేషన్న గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై నంద్యాలకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న నిరంజన్‌రెడ్డి విజయవాడ ఏపీయూడబ్ల్యూఎస్‌కు బదిలీ అయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ..పట్టణంలోని అభివృద్ధి తన వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది. పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రం మంత్రిని కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

పరమటూరుకు బస్సు సౌకర్యం



బస్సుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

బండిఆత్మకూరు జూన్12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల పరమటూరు గ్రామానికి ఆర్టీసీ బస్సు ఎట్టకేలకు చేరుకుంది. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ పరమటూరు గ్రామానికి బస్సు ఏర్పాటు చేశారు. గురువారం గ్రామానికి బస్సు చేరుకోగానే టీడీపీ మండల అధ్యక్షుడు నాగ కృష్ణారెడ్డి, సాయిబాబారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాయుడు, పరమేశ్వర రెడ్డి, నాగేంద్ర, శేఖర్‌రెడ్డి, గోపాల్, పలువురు గ్రామస్థులు బస్సును స్వాగతించి ఎమ్మెల్యేకు, డిపో మేనేజర్‌కు అభినందనలు తెలిపారు.

ఆలయ భూములకు పెరిగిన ఆదాయం

బండిఆత్మకూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విష్ణునందీశ్వర స్వామి ఆలయ భూములకు ఆదాయం పెరిగినట్లు ఆలయ ఈవో జీ వేణునాథ రెడ్డి తెలిపారు. గురువారం ఆలయాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో ఆలయానికి చెందిన 14 ఎకరాల భూములకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ ఏడాది రూ.4,57,500రాగా, గతంలో రూ.3,63,000 లభించిందన్నారు. గతం కంటే ఈ ఏడాది రూ.94500 ఆదాయం పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ తిరుపంరెడ్డి, డాక్టర్ భరద్వాజశర్మ, మాజీ ఎంపపీ నాగభూపాల్‌రెడ్డి, వెంకటరామయ్య, సోమశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● శింగవరం, నారాయణాపురం, ఓంకారం ఆలయాలకు చెందిన భూముల కౌలు వేలం పాటల్లో ఆదాయాలు స్వల్పంగా పెరిగినట్లు ఈవో నాగప్రసాద్ తెలిపారు. గురువారం పర్యవేక్షణాధికారి గోపి ఆధ్వర్యంలో శింగవరం వెంకటేశ్వర, అంజనేయ స్వాములకు చెందిన 41.06 ఎకరాల భూములకు గతంలో 12,97,000 రాగా ప్రస్తుతం రూ.13,07,000 లభించిందన్నారు. అలాగే ఓంకారం ఆలయ భూములు 7.60 ఎకరాలకు గతంలో రూ.2,15,000 రాగా, ప్రస్తుతం రూ.2,45,000 వచ్చిందన్నారు. నారాయణపురం ఆంజనేయ, నారాయణ స్వాములకు చెందిన 18.32 ఎకరములకు గతంలో రూ.5,04,600 రాగా, ప్రస్తుతం రూ5,09,600 లభించి ఆదాయాలు స్వల్పంగా పెరిగాయని ఈవో తెలిపారు.

కుక్క దాడిలో 13 మందికి గాయాలు

ఆత్మకూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో గురువారం ఓ కుక్క వీరంగం సృష్టించింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో రోడ్డు వెళ్లే జనాన్ని కరవడంతో పాటు అక్కడ ఎవరు కనిపిస్తే వారిపై దాడి చేసింది. దీంతో సుమారు 13 మంది దాకా కుక్క దాడిలో గాయాలపాలయ్యారు. గాయపడిన వారు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఆత్మకూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లకాలువ గ్రామంలో రమాదేవి బాయి అనే మహిళ గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. సీఐ రాము తెలిపిన వివరాలివీ.. గ్రామానికి చెందిన రమాదేవి బాయి అనే మహిళ ఒంటరిగా నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాలు, అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగారు. అనంతరం తాను అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకోబోతున్నానని సీఐ రాముకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో హుటాహుటిన సీఐ పోలీసులతో కలిసి నల్లకాలువ గ్రామానికి చేరుకుని రమాదేవిబాయి ఇంటికి వెళ్లి చూడగా పురుగుల మందు తాగి పడి ఉన్నారు. ఆమెను పోలీస్ వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్య చికిత్సలు నిర్వహించారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

కొత్తపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సుమారు 3వేల విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేసినట్లు ఎంఈవో-2 ఇనయతుల్లా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల పునఃప్రారంభైన రోజునే అన్ని పాఠశాలలకు విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం బెల్టులు, బ్యాగ్స్‌లను విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు. ఇంకా విద్యార్థులకు షూస్ రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని, అవి భర్తీ అయిన వెంటనే విద్యాబోధన మొదలవుతుందని ఆయన వివరించారు.

జూపాడుబంగ్లా: ప్రభుత్వం అందజేసిన పుస్తకాలు, నోట్‌బుక్కులు, బ్యాగుల సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్లును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని యాదవకార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, పాఠశాల యాజమాన్యకమిటీ చైర్మన్ అహ్మద్ అన్నారు. కనకయ్యకొట్టాల జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు కిట్లును అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పగిడ్యాల: పగిడ్యాల మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులకు టీడీపీ నాయకులు గురువారం పాఠ్యపుస్తకాలు అందజేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్యపుస్తకాలను, బ్యాగులను టీడీపీ నాయకుడు దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, పాఠశాల కమిటీ చైర్మన్ నరసింహ, నాయకులు రాగుల రామస్వామి, భూషిగౌడ్, పుల్లయ్యగౌడ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

గడివేముల: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్న సందర్భంగా మండలంలోని బిలకలగూడురు గ్రామంలో ఎంపీయూపీ స్కూల్‌లో మాజీ కో-ఆప్షన్‌మెంబర్ రఫిక్, విద్యా కమిటీ చైర్మన్ రాజశేఖర్, షేక్.అజామ్ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. బిలకలగూడురు గ్రామంలో టీడీపీ యువనాయకుడు ఎస్ఏ కాలిద్‌బాషా, జనసేన నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రెడ్డిలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

షర్మిలను కలిసిన నాయకులు

కొత్తపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న పలు సమస్యలను కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దృష్టికి తీసుకెళ్లారు. గురువారం వైఎస్ షర్మిళ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని సూరజ్ గ్రాండ్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొత్తపల్లి మండలం శివపురం గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు మద్దిలేటి మండలానికి సంబంధించి పలు ప్రజా సమస్యలను షర్మిలకు విన్నవించి వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా మండలంలోని ఎత్తిపోతల పథకాలు, శివపురం ఎద్దులేరు వాగుపై వంతెన, కొలనుభారతి, సంగమేశ్వరం ఆలయాల అభివృద్ధి, సిద్దేశ్వరం వద్ద అలుగు నిర్మించాలని పలు సమస్యలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఆత్మకూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి కుమార్, ఏపీఎస్ జిల్లా కార్యదర్శిశ నాగరాజు కోరారు. గురువారం ఎంఈవో బాలాజీనాయక్‌కు వారు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆత్మకూరు పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులను పెంచి ప్రజలను దోచుకుంటున్నారని అన్నారు. అదేవిధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, ఇతర సామగ్రి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కి పాఠశాలల్లో కనీస వసతులు లేకుండా విద్యార్థుల భవిష్యత్‌లతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేతనాలు పెంచాలి



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు జీవో నెం36 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్దనాగరాజు కోరారు. గురువారం ఆత్మకూరు పట్టణంలో ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. పాతబస్టాండ్ నుంచి కేజీరోడ్డు, తహసీల్దార్ కార్యాలయం మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి మున్సిపల్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు పని తగ్గ వేతనం ఇవ్వాలని అన్నారు. అలాగే పెండింగ్ పీఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని చెప్పారు. లేనిపక్షంలో సమ్మె చేపట్టేందుకు సిద్ధమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తిమ్మయ్య, ప్రసాద్, జోసఫ్, గౌడుగురాజు, జయన్న, నాగన్న, రాజేంద్ర, సురేష్, హోసన్న, సువర్ణమ్మ తదితరులు ఉన్నారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

నంద్యాల కల్చరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో త్రిఫలవృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామి గురువారం విశేషపూజలు నిర్వహించారు. లోకకల్యాణార్థం ముందుగా గణపతి పూజ నిర్వహించి దత్తాత్రేయ స్వామి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.

● శ్రీశైల క్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీశైలం కుమార్ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా మహాగణపతిం, శివపాదమంజీరనాదం, శివశివ శంకర,శివస్తుతి, దేవీ స్తుతి, తదితర గీతాలకు శరణ్య, కవిత, రజిత, శ్రావణి, తదితరులు నృత్యప్రదర్శన చేశారు. ఈ నిత్యకళారాధనలో భాగంగా హరికథ, బుర్రకథ, సంప్రదాయనృత్యం, వాయుద్య సంగీతం, భక్తిరంజని, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విగ్రహ ప్రతిష్ఠ

పాములపాడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామంలో ముక్కంటి ఈశ్వర స్వామి నూతన దేవాలయం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 10 నుంచి ప్రారంభించిన పూజా మహోత్సవాలు 12వ తేది విగ్రహ ప్రతిష్ఠతో ముగిశాయి. గురువారం ప్రభాతపూజ, ప్రతిష్ఠాంగ హోమాలు, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, నేత్రోన్మీలనం, బింబకళాన్యాసం, కూష్మండబలి, కక్షజ్వాల, గోకన్య దర్శనం, కుంభాభిషేకం, బలివరణం, మహాపూర్ణహుతి, అజ్య ప్రాశనం, అజ్యావలోకనం, మహా మంగళ హారతి, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.

శక్తి యాప్‌పై అవగాహన

నంద్యాల టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలోని పలు కళాశాలలు, రైల్వే స్టేషన్లు, బస్టాండుల్లో శక్తి యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఈ యాప్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేక బృందంతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. సెల్‌ఫోన్‌లో ప్రతి మహిళ యాప్‌ను డౌన్ లోడు చేసుకుని ఎవరికైనా ఆపద సమయంలో సిబ్బంది చెప్పిన విధంగా చేస్తే వారికి వెంటనే సాయం చేయడానికి పోలీసులు వస్తారన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా శక్తి టీం పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల తనిఖీ

నంద్యాల టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్న క్యాంటీన్లను నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం ఆయన నూనతంగా బాధ్యతలు చేపట్టి అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో తిరిగి శానిటైజేషన్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులకు కుడా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం

ఆత్మకూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఎస్ఎంసీ చైర్మన్ శివకుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పాఠశాలలో సన్నబియ్యంతో వడ్డిన ఆహార పదార్థాలను వారు విద్యార్థులకు వడ్డించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గతంలో రేషన్ బియ్యంతో తయారయ్యే ఆహారాన్ని అందించడం జరిగిందని అయితే కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా విద్యార్థులకు సన్నబియ్యంతో నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ దేవానంద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

నందికొట్కూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించి నూతన వ్యవసాయ విధానాలతో తక్కువ పెట్టుబడి తో అధిక దిగుబడులు సాధించాలని నందికొట్కూరు ఏవో షేక్షావలి, భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సూగన్న రైతులకు సూచించారు. గురువారం నందికొట్కూరు మండలంలోని కొణిదేల, నాగటూరు గ్రామాలలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, అలాగే భారతీయ వ్యవసాయ పరిశోధనామండలి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ సభను నిర్వహించారు. శాస్త్రవేత్తలు రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులు, శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించారు. తుక్కువ పెట్టుబడి తో అధిక దిగుబడులు ఎలా సాధించాలో తెలియ జేశారు. భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం, ప్రస్థుతం పంటల్లో వెయ్యవలసిన ఎరువుల మోతాదును వివరించారు. మొక్కజొన్న, కంది, వరి, సోయాబీన్ పంటలలో సస్యరక్షణా చర్యలైన విత్తన శుద్ధి, తెగుళ్లు, పురుగు మందుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అలాగే మండల వ్యవసపాయ అధికారి షేక్షావలి వ్యవసాయ శాఖా అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే పిచికారీ విధానంలో డ్రోన్ టెక్నాలజీని వివరించి చూపించారు. కృషి విజాన కేంద్రం శాస్త్ర వేత్త రవి గౌడ్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాగుకు యోగ్యమేదీ?

● ఎస్సార్బీసీ కాలువకు బీటలు ● లీకేజీలతో కొండజూటూరు చెరువుకు నిత్యం నీరు ● తడి ఆరక బీడుగా మారిన భూములు



పొలాల్లో ఏపుగా పెరిగిన జమ్ము

పాణ్యం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సార్బీసీ లీకేజీలతో పంట పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. ఏడాది పాగు పొలాలు ఆరకుండా ఉండడంతో పంటలు వేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. మండలంలోని కొండజూటూరు చెరువుకు పెద్ద ఎత్తున నీరు చేరుతుండడంతో పంట పొలాలు ఆరడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 13 ఏళ్లుగా చెరువుకు నిత్యం నీరు చేరుతుండడంతో పంట పొలాల్లో జమ్ము పెరిగి సాగుకు పనికిరాకుండా పోయిందంటున్నారు. దాదాపు వంద ఎకరాలు బీడుగా మారాయి. గడివేముల మండలం భోగేశ్వరం దేవస్థానం నుంచి వచ్చే నీరు తిరుపాడు, కొర టమద్ది గ్రామాల మధ్య కుందూ నదిలో కలవాల్సి ఉండగా చెరువుకు చేరుతోంది. గోరుకల్లు రిజర్వాయర్ లీకేజీ నీరు, బైపాస్ కెనాల్ లీకేజీ నీరు, రిజర్వాయర్ మొదటి తూము నుంచి ఎస్సార్బీసీ కాలువ ద్వారా వచ్చే నీరు కాలువకు బీటలు ఏర్పడి నీరు లీకు కావడంతో కొండజూటూరు చెరువుకు చేరుతోంది. 2022లో గేదెలు, ఈఏడాది గొర్రెలు నీటిలో పడి మృతి చెందాయి. కొండజూటూరు, గోరుకల్లు గ్రామాల సమీపంలో దాదాపు 50 ఎకరాలు నీటితో నిల్చి చిన్న తటాకంలా మారింది. పంటలు వేసిన పొలాల్లో వరి కోతలు కోయడానికి భారీ యంత్రాలు ఉపయోగించాల్సి వస్తోంది. దీంతో రైతులపై ఆర్థిక భారం పడుతుంది.

ఆక్రమణలతో మరిన్ని సమస్యలు

చెరువు ఆక్రమణకు గురి కావడంతో రైతులకు మరిన్ని సమస్యలు ఏర్పడ్డాయి. చెరువును ఆక్రమించి నిర్మాణాలు, వాములు, రహదారులు వేయడంతో చెరువులో నీరు కిందకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. చెరువులో అక్రమంగా రహదారి నిర్మించడంతో చెరువులోని నీరు కిందికి వెళ్లకుండా పంట పొలాల్లోకి వెళ్లి పంటలను ముంపునకు గురి చేసోంది.



లీకేజీ కారణంగా చెరువులోకి వెళ్తున్న నీరు

ఆక్రమణలపై ఎంఐ అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువు గ్రామానికి ఆనుకొని ఉండడంతో గ్రామంలో దోమల బెడద ఎక్కువైంది. దీంతో గ్రామస్థులు వ్యాధుల బారిన పడుతున్నారు. చెరువు నీరు కిందికి వెళ్లేలా చర్యలు చేపట్టాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పొలాలు బీళ్లుగా మారాయి



చెరువుకు నీరు చేరడంతో పంట పొలాలు బీళ్లుగా మారాయి. ఎస్సార్బీసీ కాల్వ లీకేజీలను పూడ్చాలి. చెరువు ఆక్రమణలతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆయకట్టు తగ్గింది. చెరువులో నీరు ఎక్కువగా ఉండడంతో చెరువు పరిధిలోని మిగిలిన పొలాల్లో జోము తీసుకుంటు న్నాయి. కుందూకు వెళ్లాల్సిన నీటిని కుందూకు వెళ్లేలా చర్యలు చేపట్టాలి. చెరువులో నీరు తగ్గేలా చర్యలు చేపట్టాలి.

● సుధాకర్, రైతు, కొండజూటూరు

లీకేజీలను అరికట్టాలి



ఎస్సార్బీసీ లీకేజీలను అరికట్టాలి. చెరువుకు నీరు చేరకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. చెరువు ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలి. చెరువును సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తే పంటల సాగు కొంత మెరుగుపడుతుంది. రైతులకు సాగు చేసుకోవడానికి ఆటంకాలు తొలగుతాయి. చెరువులో అక్రమంగా వేసిన రహదారి తొలగించాలి. చెరువుకింద సాగు తగ్గుతోంది. పంటల దిగుబడి తగ్గుతోంది.

● కేశవులు, కొండజూటూరు

పీఎం సూర్యఘర్‌పై అవగాహన



మాట్లాడుతున్న విద్యుత్ డీఈ కమలాకర్

బనగానపల్లె, జూన్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై విద్యుత్ సిబ్బందికి డీఈ కమలాకర్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహిం చారు. డీఈ కమలాకర్ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో బనగా నపల్లె ఏడీ మద్దిలేటి, విద్యుత్ పట్టణ ఏఈలు శ్రీనివాసులు, రూరల్ ఏఈ గర్జప్ప, మండలంలోని పలు గ్రామాల లైన్ ఇన్స్‌పెక్టర్లు, లైన్ మెన్లు పాల్గొన్నారు

ఆలయాభివృద్ధికి రూ.25వేల విరాళం

బనగాన పల్లె, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి గురువారం బెంగళూరుకు చెందిన మద్దన శ్రీనివాస్, పార్వతి వారి కుటుంబ సభ్యులు రూ.25వేలు విరాళం అందించారు. కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఈ మొత్తాన్ని ఆలయానికి అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు. పీవీ.కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు గాధంశెట్టి రమణయ్య

సంజామల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నొస్సం గ్రామంలో బుగ్గ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఓంగోలు జాతి ఎద్దుల రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహిం చారు. రాష్ట్ర నలుమూలల నుంచి 12 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. రెండు పండ్ల విభాగంలో నిర్వహించిన ఈ పోటీలను స్థానిక సీనియర్ టీడీపీ నాయకుడు గాధంశెట్టి రమణయ్య పోటీలను ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో నంద్యాల జిల్లా మిడుతూరు మండలం రోళ్లపాడు గ్రామానికి చెందిన డాక్టర్ పేరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎద్దులు మొదటి విజేతగా నిలిచాయి. రెండో విజేతగా ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం బసినేనిపల్లె గ్రామానికి చెందిన యనకండ్ల శ్రీనివాసులు ఎద్దులు, మూడో స్థానంలో ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామానికి చెందిన తనిష్క్ కుమార్ గౌడ్ ఎద్దులు, నాలుగో స్థానంలో నంద్యాల జిల్లా గడివేముల మండలం పెసర వాయి గ్రామానికి చెందిన గిట్ట నాగేశ్వర్ ఎద్దులు, ఐదో స్థానంలో కడప జిల్లా పెద్దముడియం మండలం పాలూరు గ్రామానికి చెందిన వెంకట హేమలతారెడ్డి ఎద్దులు విజేతలుగా నిలి చాయి. విజేతలకు రూ.30వేలు, సంఘపట్నం హుసేన్‌పీరా, రూ.25వేలు నడిగడ్డ శ్రీనివాసులు తదితరులు బహుమతులను అందజేశారు.

వృద్ధురాలిపై దాడి.. కేసు నమోదు

కోవెలకుంట్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ వృద్ధురాలిపై గుర్తుతెలియని వ్యక్తి దాడిచేయగా తీవ్ర గాయాల య్యాయి. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలో ఏడుకపిలబాయి సమీపంలో మల్లమ్మ అనే వృద్ధురాలు తెల్లవారుజామున పశువుల షెడ్డులో కసువు కొడుతుండగా గుర్తు తెలియనివ్యక్తి కర్రతోదాడి చేయగా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ ఆమెను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విమాన ప్రమాదం దురదృష్టకరం



- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిన ఘటనలో 242 మంది ప్రయాణికులు, సిబ్బంది మృతి చెందడంపై రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈఘోర విమాన ప్రమాదంలో వైద్య విద్యార్థులు సైతం ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరమైన ఘటన అన్నారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని మంత్రి తెలియజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆళ్లగడ్డ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాధితులకు సీఎం సహాయ నిధికింద మంజూరైన చెక్కులను గురువారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వారికి అందజేశారు. చింతకొమ్ము దిన్నె గ్రామానికి చెందిన పూజారి వేదవతికి రూ.75వేలు, ఉయ్యాలవాడ మండలం అల్లూరు గ్రామానికి చెందిన లింగందిన్నె హుస్సేన్ బీకి రూ.87,500 చెక్కులను అందజేశారు. దీంతో బాధిత కటుంబాల సభ్యులు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ నాగమణితో విద్యార్థి సంఘాల నాయకులు

బేతంచెర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను, భూమి సమస్యలను, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని విద్యార్థి సంఘాల నాయకులు తహసీల్దార్ నాగమణిని కోరారు. గురువారం బేతంచెర్ల మండలంలో విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ నాగమణిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ (ఆర్‌వీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ఏపీ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగ సురేంద్ర యాదవ్, సుశాంత్, సూర్య, వినోద్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనపై సంబరాలు

- బనగానపల్లెలో కేక్ కట్‌చేసిన బీసీ ఇందిరమ్మ
- వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాలు



బనగానపల్లెలో కేక్ కట్ చేసిన బీసీ ఇందిరమ్మ



కొలిమిగుండ్లలో మూలే, నంద్యాల రామేశ్వరరెడ్డి సంబరాలు

బనగానపల్లె, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా గురువారం బనగానపల్లె పట్టణంలోని బీసీ జనార్దన్‌రెడ్డి మంత్రి క్యాంపు కార్యాలయం ఆవరణలో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమం వైపు కూటమి ప్రభుత్వం పరుగులు పెడుతోందన్నారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బనగానపల్లె నియోజకవర్గం అభివృద్ధి నిరంతరం కృషి చేస్తు న్నారన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, బీటీ రోడ్లు, బనగా నపల్లె పట్టణంలో షాదీఖానా, రింగ్ రోడ్డు నిర్మాణం, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాలు చేపట్టామన్నారు. త్వరలో వీటి నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. అర్హులైన పేదలందరికీ ఇంటి పట్టాలు ఇచ్చి ఇళ్లను నిర్మిస్తామని బీసీ ఇందిరమ్మ తెలిపారు.



డోన్‌లో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. ఉపసర్పంచ్ బురానుద్దీన్, ఖాశీంబాషా, నియాజ్‌హుసేన్, రాయలసీమ సలాం, కలాం, అమీర్‌జాన్, అల్తాఫ్‌హుసేన్, ఇస్మాయిల్ ఖాన్, మురళీ మోహ న్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలోనే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని టీడీపీ మండల అధ్య క్షుడు మూలే రామేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి అన్నారు. గురువారం కొలిమిగుండ్ల టీడీపీ కార్యాల యంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా కేకు కట్ చేశారు. వైసీపీ హయాంలో ఉన్న పరిశ్రమలు బయటకు వెళితే, కూటమి వచ్చిన తరువాత అనేక కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంబటి జయలక్ష్మీరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, కోటపాడు శివ రామిరెడ్డి, నరసింహారెడ్డి, గూడూరు మహేశ్వరరెడ్డి, వెంకటరాముడు, రమణమ్మ, నారాయణరెడ్డి, చెక్కా వెంకటరాముడు, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డోన్ రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పరుగులు పెడుతోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, నాయకులు లక్కసాగరం లక్ష్మీరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, పట్టణ మాజీ సర్పంచ్ పెద్దకేశవయ్యగౌడు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. నాయకులు ఓంప్రకాష్, టైలర్ ఖాజా, లారీల బాషా, ధర్మవరం ఈశ్వరయ్య, వలసలబాలుడు, అన్వర్, రవీంద్ర పాల్గొన్నారు.

శిరివెళ్ల: రాష్ట్రంలోని కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతోందని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని శిరివెళ్ల, యర్రగుంట్ల తదితర అన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టి గురువారం సంబరాలు చేసుకున్నారు.

బేతంచెర్ల: రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని టీడీపీ కన్వీనర్ ఎల్లనాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకుడు వర్దన్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ మండల సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, పోలూరు రాఘవరెడ్డి, సుధాకర్, నాగరాజు, రూబెన్, బ్రహ్మానందరెడ్డి, జాకీరుల్లా బేగ్, వార్డు కౌన్సిలర్లు రామగోపాల్, రామ్మూర్తి, రవీంద్ర నాయక్, మాధవ, ఫయాజ్, సీతారామాపురం మాజీ సర్పంచ్ వెంకట్రాముడు, శేఖర్, నల్లారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్యాపిలి: పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు టి.శ్రీనివాసులు, రాజా నారాయణమూర్తి, ఖాజాపీర్, రామ్మోహన్‌యాదవ్, ఆర్‌ఈ నాగరాజు, మధుకుమార్, చల్లా వీరాంజనేయులు, ప్రసాద్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నంద్యాలకు తరలిన కాంగ్రెస్ నాయకులు

డోన్ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో గురువారం పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన పర్యటనకు డోన్ నుంచి కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వకర్త గార్లపాటి మద్దిలేటి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో నంద్యాలకు తరలివెళ్లారు. నంద్యాలలో జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొన్నారు. అంతకుముందు వైఎస్ షర్మిలకు మద్దిలేటి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో డోన్ నాయకులు మల్లెంపల్లె జనార్దన్, జయరాముడు, జీవన్‌బాబు, పఠాన్ హుస్సేన్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



షర్మిలకు బొకే ఇస్తున్న మద్దిలేటి

భూసార పరీక్షలు తప్పనిసరి



రుద్రవరంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ధనలక్ష్మి

రుద్రవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైతులు ఖరీఫ్ సీజనులో సాగు చేసే భూములకు భూసార పరీక్షలు తప్పనిసరి చేయించి వాటి ఆధారంగా ఎరువులు వాడాలని శాస్త్రవేత్త ధనలక్ష్మి సూచించారు. గురువారం రుద్రవరం, పెద్దకంబలూరు, శ్రీరంగాపురం గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ అవగాహన సదస్సులు నిర్వహించారు. శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, ఏఈ మధు, పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, పహిమ తబుస్సుం పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వద్దు

బేతంచెర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను బిగిస్తే ధ్వంసం చేస్తామని సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మధుశేఖర్, సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, ఖాజాలు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని రిజిస్టర్ ఆఫీసు కాలనీలో స్మార్ట్ మీటర్లు బిగిస్తుండగా వాటిని ధ్వంసం చేశారు. అనంతరం వారు మాట్లాడడుతూ ప్రజలపై భారాలు మోపే ట్రూప్ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజు, వెంకటరమణ; నారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

రంగాపురంలో అగ్ని ప్రమాదం

బేతంచెర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురం గ్రామంలో గురువారం పాణ్యం మద్దిలేటిస్వామి, వెంకటలక్ష్మి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మట్టిమిద్దె కావడంతో మంటలు అదుపులోకి రాక ఇళ్లంతా కాలిపోయి దగ్ధమైంది. డోన్ ఫైర్ ఇంజన్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.లక్షన్నర ఆస్తి నష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.



షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన ఇల్లు

కొత్త పింఛన్లు మంజూరు

చాగలమర్రి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలానికి 81 కొత్త పింఛన్‌లు మంజూరైనట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ వితంతు మహిళలకు కొత్తగా ఈ పింఛన్‌లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలి

చాగలమర్రి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలు సాగు చేసుకునేందుకు సబ్సిడీవిత్తనాలను పంపిణీ చేయాలని టీఎన్‌టీయూసీ కార్యదర్శి ఉత్తి నరసింహులు కోరారు. గురువారం చాగలమర్రిలో మాట్లాడుతూ అన్ని మండలాలకు జీలుగ మంజూరు చేశారు, రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నా విత్తనాలు మంజూరు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విత్తనాలు, ఎరువులు మంజూరు చేయాలని అన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్త, మరిది అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారని పట్టణంలోని వడ్డేపేటలో నివాసముంటున్న చంద్రకళ ఫిర్యాదు చేశారు. దీంతో అత్తింటివారిపై కేసు నమోదైందని ఎస్ఐ తిరుపాలు గురువారం తెలిపారు. భర్త రాజేష్, అత్త దేవి, మరిది రాజ్‌కుమార్‌లు మరో అదనపు కట్నం తీసుకురావాలని తరచూ వేధింపులకు గురిచేస్తున్నారని చంద్రకళ ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆరోపణల్లో నిజం లేదు

బేతంచెర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై టీడీపీ నాయకులు చేసిన ఆరోపణల్లో నిజం లేదని వైసీపీ నాయకులు అన్నారు. గురు మాట్లాడుతూ పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల సంక్షేమం కోసం మాజీ మంత్రి బుగ్గన ప్రారంభించేందుకు కృషి చేసి ఫ్యాక్టరీని నడిపించాలని చెప్పడంతో ఫ్యాక్టరీని బుగ్గన నడుపుతు న్నారని టీడీపీ నాయకులు అవాస్తవాలు మాట్లాడుతున్నారన్నారు. ఆర్‌వీ కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించారే తప్ప ఫ్యాక్టరీలో స్క్రాప్‌ను బుగ్గన రూ.300 కోట్లకు అమ్ముకున్నారని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలు

- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

ఆళ్లగడ్డ జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్థోమత లేని పేదలకు ప్రభుత్వమే న్యాయ వాదిని నియమించి ఉచిత న్యాయ సేవను అందిస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి సూచించారు. గురువారం ఆళ్లగడ్డలోని సబ్ జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముద్దయిలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముద్దాయిలకు ఏమైన సమస్యలు ఉంటే ఆన్‌లైన్‌లో టోల్ ఫ్రి నెంబర్ 15100 ద్వారా కూడా సాయం అభ్యర్థించవ్చని సూచించారు. అనంతరం ముద్దాయిల సమస్యలు తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ షాహినా బేగం, ఇన్‌చార్జి ఉప కారాగార అధికారి సుబ్బయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



ఎం.తండాలో ర్యాలీ చేస్తున్న అధికారులు

చాగలమర్రి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని ఎం.తండా గ్రామంలో ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ మలేరియా అధికారి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గిరిజనుల గృహాల వద్ద ఆల్ఫాసైపర్ మిత్రిన్ ద్రావణం పిచికారీ చేశారు. ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, సీహెచ్‌వో బ్రహ్మతేజ, హెల్త్ అసిస్టెంట్ రాముడు, ఏఎన్‌ఎం రాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

దొర్నిపాడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులు సేంద్రియ ఎరువుల వాడకం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ పరిశోదన మండలి శాస్త్రవేత్త శ్రీనివాసులు సూచించారు. గురువారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఏవో ప్రమీల ఆధ్వర్యంలో వ్యవసాయ మంత్రిత్వశాఖ, భారత వ్యవసాయ పరిశోదన మండలి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, ఆదినారాయణ, వ్యవసాయ సహాయకులు శివరామిరెడ్డి, రైతులు, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.



సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాసులు

బీజేపీ నుంచి వడ్డె మహారాజ్ సస్పెన్షన్

డోన్ టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ మాజీ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి, కన్వీనర్ సందు వెంకటరమణ, బీజేపీ పట్టణ అధ్యక్షులు బద్రి సుధాకర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు రమేష్, రాజశేఖర్‌లు గురువారం తెలిపారు. వడ్డె మహారాజ్ తీరు పార్టీలో సరిగ్గా లేకపోవడంతో, పార్టీ పేరు చెప్పుకుని అధికారుల వద్ద, పార్టీ సీనియర్ నాయకులపై దురుసుగా ప్రవర్తించడంతో సస్పెండ్ చేశారనితెలిపారు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి తెలియజేసినట్లు తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం

తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.రవికుమార్‌ను మీసేవా ఆపరేటర్లు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మీసేవ ఆపరేటర్లు ధనుంజయ, రవి, శ్రీరాములు, రామేశ్వర్‌గౌడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బడి గంట మోగింది

- మొదటి రోజే విద్యార్థులకు కిట్లు అందజేత



బేతంచెర్లలో ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

డోన్ టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం గురువారం బడిగంట మోగింది. విద్యార్థులకు పాఠశాలలో డెకరేషన్లు చేసి వెల్‌కం బోర్డులతో స్వాగతం పలికారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకంలో సన్నబియ్యంతో ప్రారంభించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు.

బేతంచెర్ల, జూన్: మండలంలో ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. అలాగే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో విద్యార్థులకు ఎంఈవో సోమశేఖర్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం పాపారాయుడు, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బనగానపల్లె: కూటమి ప్రభుత్వం మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లె రాధా కృష్ణన్ విద్యామిత్ర పథకంలో భాగంగా పుస్తకాలు బ్యాగులు, బెల్టులు, బూట్లు గురువారం పంపిణీ చేశారు. బనగానపల్లె పట్టణం లోని కస్బా ప్రాథమిక పాఠశాలలో కూడా వీటిని హెచ్‌ఎం సుంకన్న ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులు అబ్దుల్ ఖలీమ్, సత్యప్రకాశ్, పుష్పలత పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: కూటమి ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ మరింత బలోపేతమైందని మండల తెలుగు యువత అధ్యక్షుడు గొంగటి హుస్సేన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెట్నికోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాలలు తెరిచే సమ యానికి సకాలంలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు అందించడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నా రని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ధరణిదేవి, ఉపాధ్యా యులు రమణయ్య, నీలకంఠేశ్వరరెడ్డి, బాస్కరరెడ్డి, చంద్రశేఖర్, మోహన్, ఇంద్రరాజు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : మండలంలోని అహోబిలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల అధికారులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈవో శోభావివేకవతి, తహసీల్దార్ జ్యోతిరత్నకుమారి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు విద్యా కిట్ లను విద్యార్థులకు అందజేశారు. వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





డోన్‌లో విద్యార్థులకు వెల్‌కం బోర్డులతో స్వాగతం చెబుతున్న దృశ్యం, బనగానపల్లెలో కిట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు